

నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం - 36

# స్వేచ్ఛ పేరుతో విశృంఖలత్వం తగదు!

**- గంధం యాజ్ఞవల్క్య శర్మ**

ఏడుపదుల వయసున్న గంధం యాజ్ఞవల్క్య శర్మగారు తన జీవిత కాలంలో రాసింది కేవలం యాభై కథలే! ఈయన కథలు నేలవిడిచి సాము చేయవు. తనకు తెలిసిన, తన చుట్టూ ఉన్న మనుషులూ, తను నివసిస్తున్న ప్రాంతాల చుట్టూనే ఈయన కథలు తిరుగుతుంటాయి. అందుకే వీరి కథలు ఇప్పుడు చదివినా తడితడిగా ఉంటాయి. ప్రపంచీకరణ పరిణామాలను ఇటీవల చాలా మంది కథలుగా రాస్తున్నప్పటికీ, 46 సంవత్సరాల క్రితమే అలాంటి కథలు రాశారు యాజ్ఞవల్క్య శర్మగారు. అలాంటి ముందు చూపున్న ప్రముఖ కథకుడితో ఇంటర్వ్యూ ఈవారం..

### నాన్న స్వాతంత్ర్య సమరయోధులు


పాతబాపట్ల తాలూకా లింగంగుంటపాలెం అనే కుగ్రామంలో 16 ఆగస్టు 1937న నేను పుట్టాను. మా నాన్న గంధం సీతాపతి శర్మగారు, అమ్మ వెంకటసుబ్బమ్మ. మేం ఐదుగురం మగపిల్లలం, ఇద్దరు ఆడపిల్లలు. నాన్న స్వాతంత్ర్య సమరయోధులు. స్వాతంత్ర్యం కోసం జైలుకు కూడా పోయారు. స్వాతంత్ర్యం వచ్చాక రాజకీయాలు మానుకున్నారు. టీచరుగా పనిచేశారు. నాన్న స్వయంగా కవి. నాటకాలూ, జాతీయ గీతాలు కూడా రాశారు. ఆయనకి మంచి లైబ్రరీ ఉండేది. నేను చిన్నప్పటినుంచీ అన్ని పుస్తకాలూ చదువుతుండేవాడిని. ఇక మా పితామహులు చలమయ్యగారు పండితులు, కవులు. వారు కొన్ని కావ్యాలనూ, కొంత భక్తి కవిత్వాన్ని వెలయించారు. మా పెద్దన్న గంధం వెంకాస్వామి శర్మగారు 1950వ దశకంలో 'చైతన్య' అనే కలంపేరుతో కొన్ని మంచి కథలు రాశారు. నాకు సాహిత్యం పట్ల ఆసక్తి ఏర్పడటానికి మా కుటుంబ వాతావరణం దోహదపడితే, నేను కథలు రాయడానికి స్ఫూర్తి మాత్రం మా పెద్దన్న వెంకాస్వామి శర్మగారే!

### బుచ్చిబాబుగారిలా రాయాలనుకునే వాడిని!


నేను హైస్కూలు విద్యార్థిగా ఉన్న రోజుల్లో బుచ్చిబాబుగారి కథలు చదివే వాణ్ణి. ఆయనగారి రచనా విధానం నాకెంతో నచ్చేది. వారి 'చివరకు మిగిలేది' నవల నన్నెంతో ఆకట్టుకుంది. బుచ్చిబాబుగారిలా రాయాలని అనుకునేవాణ్ణి. అలా రాయలేదనుకోండి. అయినా నా కథలపై వారి ప్రభావం ఉండే ఉంటుంది. చిన్నప్పుడు నా మిత్రుడు 'కుత్తి లక్ష్మీపతి రెడ్డి'కి తరచూ జాబులు రాసేవాడిని. వాటిల్లో ఏదో కథాకథనం, కావ్యతత్వం వుందన్నట్టు అతను మాట్లాడేవాడు. నన్ను రెచ్చగొట్టి ఈ వ్యాసంగం వైపు మరలేలా చేసింది అతనే. నేను డిగ్రీ చదువుతున్న రోజుల్లోనే 1956లో అనుకుంటాను మొదటి కథ 'గుంటూరు గోల' రాశాను. అది వ్యంగ్య రచన. గుంటూరులో అప్పట్లో హైకోర్టు ఉండేది. ఉద్యోగులు ఎక్కువమంది ఉండేవారు. ఆ రోజుల్లో గుంటూర్లో అద్దె ఇల్లు దొరికేవి కావు. అయితే గుంటూరు నుంచి హైకోర్టు మారిపోతోంది అనగానే అక్కడ గోల మొదలయింది. దీనినే రచనగా మలచాను. ఇది 'ఆంధ్రపత్రిక'లో వచ్చింది. నేను ఇప్పటిదాకా మొత్తం 50 కథలు మాత్రమే రాశాను. అందులో చాలా కథలు పోయాయి. ఉన్న వాటిల్లోంచి 22 కథలతో 'సెలవయింది' పుస్తకం వెలువడింది. రెండు నవలలు కూడా రాశాను.

### బీదవాళ్ళ కోసం పని చెయ్!

నాకు డిగ్రీ అయిపోగానే 1959లో కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చింది. మాచర్ల దగ్గర పోస్టింగ్ ఇచ్చారు. నేను ఉద్యోగానికి పోతున్న మొదటి రోజు మా నాన్నగారు నాతో ''ఏనాడూ నువ్వు ఎవరి దగ్గరా కాణీ ఆశించకు. బీదవాళ్ళను దృష్టిలో పెట్టుకుని పనిచెయ్. ధనవంతుల కోసం నువ్వు పనిచెయ్యకు'' అన్నారు. ఆయన చెప్పిన మాటలను నేను ఉద్యోగంలో ఉన్నన్ని రోజులూ పాటించాను. కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లోనే సబ్ రిజిస్ట్రార్‌గా పదవీ విరమణ చేశాను.



భార్య చౌడేశ్వరితో....



కోలవెన్ను రామకోటీశ్వరరావుతో...

### నాకు స్త్రీల పట్ల సానుభూతి ఎక్కువ

నేను ఒక నిబద్ధతకు కాని, ఒక సిద్ధాంత పరమైన అవగాహనకు కాని కట్టుబడి కథలు రాయలేదు. ఏది నాకు కథ అనిపిస్తే అది రాసాను. నా చుట్టూ వాతావరణం, మనుషులు, వాళ్ల చిత్త ప్రవృత్తులు నాకు అర్థమైన రీతిన రాశాను. నా చుట్టూ జరిగిన సంఘటనలను, నా అనుభవాలను, నా పరిధిలోని సంయోగ, వియోగానుభూతులను, సంకల్ప వికల్పాలను రాశాననుకుంటున్నాను. నా కథలలోని చాలా పాత్రలు నాకు ఎదురైన కొందరి ప్రతిబింబాలు. నాకు స్త్రీల పట్ల సానుభూతి ఎక్కువ. ఎక్కడా నా కథల్లో స్త్రీలను కించపరుస్తూ రాయలేదు. నా చాలా కథలలో మాతృమూర్తులు, వృద్ధ స్త్రీ మూర్తుల పాత్రలుంటాయి. ఆ పాత్రల తీరుతెన్నులు, సంభాషణలలోని నుడికారం, సౌజన్యం, మా తల్లిగారు వెంకటసుబ్బమ్మగారి నుంచి, మా మేనత్త జయలక్ష్మిగారి నుంచి గ్రహించాను. నాకు బంధుప్రీతి ఎక్కువ. అందుకే నా కథల్లో బాబాయిలు, మేనమామల పాత్రలు సైతం ఎక్కువగా కన్పిస్తాయి.

### హింస కూడదు


నా కథలలో దుష్టపాత్రల పట్లకూడా నాకు సానుభూతి ఉంటుంది. ఇందుకు కారణం మా అమ్మగారనుకుంటాను. మా అమ్మకు కరుణాప్రవృత్తి ఎక్కువ. మహాత్మాగాంధిని గాడ్సే కాల్చి చంపిననాడు 'అయ్యో! ఇదెక్కడి పాపంరా నాయనా' అంటూ కన్నీరెట్టుకుంది. తరువాత గాడ్సేను ఉరితీసిన వార్త విని 'అయ్యో! ఆ జీవుడెంత అల్లాడాడో' అనీ మా అమ్మ బాధపడింది. వ్యక్తి ఎలాంటి వాడైనా కానీ, అతని పట్ల హింస కూడదు, కరుణ చూపాలనే సంగతి మా అమ్మనుంచి గ్రహించాను.

## గొప్పవారి పరిచయ భాగ్యం కలిగింది

కథారచన వలన నేను మహామహుల ఆదరణను పొందాను. అందులో కోలవెన్ను రామకోటీశ్వరరావుగారు ఒకరు. వారు 'త్రివేణి' పత్రిక వ్యవస్థాపక సంపాదకులే కాక, గొప్ప సాహితీవేత్త, దేశభక్తులూను. 1960 నుంచి పది సంవత్సరాల పాటు వారితో కలసి తిరిగే అవకాశం కలిగింది. నరసరావుపేటలో రోజూ వారిని కలిసేవాడిని. ఆ రోజుల్లోనే విశ్వనాథ సత్యనారాయణగారు, బెజవాడ గోపాలరెడ్డి, నార్ల వెంకటేశ్వరరావు, అనిశెట్టి సుబ్బారావు, కుందుర్తి ఆంజనేయులు లాంటి గొప్పవారి పరిచయ భాగ్యం కలిగింది. 1972లో ఉద్యోగ రీత్యా రేపల్లె వెళ్లిన నాకు కవిసామ్రాట్ నోరి నరసింహశాస్త్రిగారితో పరిచయ భాగ్యం ఏర్పడింది. వారికి పిన్నల పట్ల ఎంతో వాత్సల్యం. వారు ఎన్నో చారిత్రిక నవలలు రాశారు. వాటి నేపథ్యాన్ని వారి నోట వినగల్గాను.

## ఎంత పొంగిపోయానో

బి.నరసింగరావు (బీనాదేవి)గారు గుంటూరులో ఏదో సభకు వచ్చిన మహాకవి శ్రీశ్రీగారికి, కథకులు రావిశాస్త్రి గారికి నన్ను కథకునిగా పరిచయం చేశారు. శ్రీశ్రీగారు క్షణం సేపు ఏదో గుర్తు చేసికొని, ''మీ వైతరణి



కొడుకు, కోడలు, మనవరాలితో....

అనే కథను ఎవరో చూపారు. చదివాను. బాగుంది.'' అన్నారు. ఎంత పొంగిపోయానో!

## ఒకరు స్ఫూర్తి మరొకరు గీటురాయి

దాదాపు నా అన్ని కథలకు మొదటి శ్రోత మా రెండవ అన్న లోకనాథశర్మగారు. ఆయన మంచి క్రిటిక్. ఇంగ్లీషు కూడా బాగా చదువుకున్నారు. ఆయన కథ చదివి బాగుంది అంటేనే నేనేదైనా పత్రికకు పంపించేవాడిని. ఆయన ఇప్పటికీ సాహిత్యం చదువుతుంటారు. నేను కథలు రాయడానికి పెద్దన్నయ్య స్ఫూర్తి అయితే, ఈయన నా కథలకు గీటురాయి లాంటివారు.

## మా అబ్బాయి కూడా కథకుడే!

1962లో చౌడేశ్వరితో నాకు వివాహం అయింది. మాకు ఒక అబ్బాయి. గంధం నాగరాజు. బాబు పుట్టాక మా ఆవిడ కాలం చేశారు. మా అబ్బాయి కూడా మొదట్లో కథలు రాశాడు. ప్రస్తుతం సినిమాలకు రాస్తున్నాడు.

## 20 మైళ్ళు నడచి వెళ్ళాం

కొండా వెంకటప్పయ్యగారు స్వాతంత్ర్య సమరయోధులు, మాకు బంధువు కూడా. 15 ఆగస్టు 1947న మనకు స్వాతంత్ర్యం వచ్చింది. ఆ రోజు గుంటూరులోని గాంధీపార్క్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో పాల్గొనటానికి మా ఊరి నుంచి 150 మంది 20 మైళ్లు నడచి వెళ్లారు. వారిలో నేనూ ఒకడిని. ఆ రోజు కొండా వెంకటప్పయ్యగారు ప్రసంగించారు. ఆయన ప్రసంగంలో నాకు ఇంకా బాగా గుర్తున్న విషయం ఏంటంటే ''మనం ఇన్నాళ్లు పన్నులు ఎగవేశాం. అధికారులను ఎదిరించాం. రైళ్లలో టికెట్లు లేకుండా ప్రయాణించాం. అయితే ఇక మీదట అలా చేయకండి. ఇక ఉండేది మన ప్రభుత్వమే. ప్రభుత్వానికి సహకరించండి'' అన్నారు. ఆయన మాటలతో సభలో నవ్వులు విరిసాయి.

### నచ్చినవి

**కథకుడు :** బుచ్చిబాబు

**కవి :** విశ్వనాథ సత్యనారాయణ

**పాటలు :** మల్లీశ్వరిలో భానుమతి పాడిన పాటలన్నీ

**నవల :** చివరకు మిగిలేది

**గాయని :** భానుమతి, సుశీల

**గాయకుడు :** మంగళంపల్లి

**వ్యక్తి :** కీ.శే. కోలవెన్ను రామకోటీశ్వరరావు

**వంట :** వంకాయకూర

## విలువల్ని ఎలా పునరుద్ధరించాలి?

ఆ రోజుల్లో దేశభక్తి అనేది అందరిలో ఉండేది. అప్పట్లో కట్టుబాటు ఉండేది. పద్ధతి, నీతి, విలువలు ఉండేవి. ఇప్పుడు అవి ఎందులోనూ లేవు. ఉద్యోగుల్లో కాని, ప్రజా నాయకుల్లో కాని, సామాన్య మానవుడిలో కాని అవి లేవు. ఎవడికి వాడు తన కోరికలు ఎలా తీర్చుకోవాలి అనే ఆలోచిస్తున్నాడు. చదువులు పెరిగాయికానీ సంస్కారం పెరగలేదు. అభద్రతా భావం పెరిగిపోయింది. దీనికి జనాభా పెరుగుదల కూడా ఒక కారణం కావచ్చు. విలువల్ని ఎలా పునరుద్ధరించాలనేది ప్రస్తుతం మన మధ్యనున్న పెద్ద సమస్య. విలువల్ని పునరుద్ధరించకపోతే యింకా యింకా ఈ సమాజం పాడయిపోతుంది.

## ప్రస్తుతం 'ఫ్రీజ్' అయిపోయాను

అప్పటికీ ఇప్పటికీ కొన్ని విలువలు, అభిప్రాయాలు బాగా మారి పోయాయి. వాటికి అనుగుణంగా నేను రాయలేకపోతున్నాను. ఒకరకంగా చెప్పాలంటే నేను ప్రస్తుతం 'ఫ్రీజ్' అయిపోయాను. మనం అనుకున్న విలువలు, అనుకున్న నీతులూ ఇప్పుడు కథల్లో రాస్తే యువత చదవడం లేదు. వాళ్లకు కథలు కూడా అల్ట్రామోడర్న్‌గా ఉండాలి. అలా నేను రాయలేకుండా ఉన్నాను.

## స్వేచ్ఛ పేరుతో విశృంఖలత్వం వద్దు

ఇప్పుడు మంచిమంచి కథలు వస్తున్నాయి. కదుల్తున్న దృశ్యాలను చూస్తున్నారు. కథల్లో చూపిస్తున్నారు. ఇప్పటి రచయితల్లో స్పార్క్ ఉంది. అయితే సంఘం చెదిరిపోయే కథలు రాయకుండా ఉంటే బాగుంటుంది. ఉన్న సమస్యలను కథల్లో చూపండి. తప్పులేదు. అయితే ఆ సమస్యలు తీరడం కోసమని డిజాస్టర్ క్రియేట్ చేయడం మంచిది కాదు. తగుల బెట్టేద్దాం అనే ధోరణిలో రాయకుండా ఉంటే బాగుంటుంది. ఉన్న సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో సామరస్యంగా చెప్తే బాగుంటుంది. యువత మాఫియాలాగా మారే సజెషన్స్ మాత్రం కథల ద్వారా యివ్వకుండా ఉండాలి. ఇప్పటికే సమాజం కల్లోలంగా ఉంది. కల్లోలం పెరగడానికి దోహదం చేసే కథలు రాయకుండా ఉంటే బాగుంటుంది. ఉదాహరణకు స్త్రీకి స్వేచ్ఛ కావాలి. రైట్. అయితే స్వేచ్ఛ పేరుతో విశృంఖలత్వం వద్దు. అలాంటి దృష్టితో కథలు ఉండాలి.

–సుంకోజి దేవేంద్రాచారి

నాకు నచ్చిన నా కథ

# సెలవయింది

- గంధం యాజ్ఞవల్క్య శర్మ

వర్షపు జల్లు కొంచెం వెనుకాడింది.

"నాయనా, రామూ! ఎవరో ఏమో అన్నారని సాక్షాత్తూ ఆ వెంకటేశ్వరస్వామికి అపచారం చేస్తామా? తెల్లవారితే ఆ స్వామి కల్యాణ మహోత్సవం. మనం వెళ్లి సేవించకుంటే ఆ పాపం మహోగ్రమై మనలను జన్మ జన్మాలకు వెన్నాడదూ?" అన్నాడు కృష్ణంరాజు తమ్ముడు రామరాజుతో.

రామరాజు మొరాయించాడు, 'నేను మళ్లీ ఆ ఊరి పొలిమేర తొక్కను"అని.

కృష్ణం రాజుకు కొంచెంగా దగ్గుతెర వచ్చి సర్దుకొంది. కాని మనసు వికలమైంది. బాధతో సుళ్ళు తిరిగింది. రామరాజు తన నిర్ణయం అంతిమమన్నట్లు చెప్పి పోయాడు అక్కడినుంచి. కృష్ణంరాజు హృదయం కలుక్కుమంది. ఆ బాధ శరీరమంతా వ్యాపించినట్లు అనిపించింది.



రాజు ఓపిక చేసుకొని బయటకు వచ్చి తొంగి చూశాడు. ఆకాశమంతా నల్లని మేఘాలతో పొంచి ఉంది. తూర్పు దిక్కుగా ఎర్రనైంది. మిన్నున ఇంద్ర ధనుస్సు వెలసింది. దక్షిణ దిశగా చిన్న సౌదామిని భ్రమిసింది.

"రేపే స్వామివారి కల్యాణ మహోత్సవం" గొణుక్కుంటున్నాడు రాజు. నలభై సంవత్సరాలు ఆ స్వామి సన్నిధిలో బ్రతికాడు. తన జీవితాన్నంతా ఆ స్వామి భజనలో పునీతం చేసుకొన్నాడు. అలాంటిది ఈనాటికి వదిలి వేయటమా? రాజు మనసు కలతపడింది. అలా జరగడానికి వీలు లేదు. అలా జరిగితే తన ఈ జన్మకు అర్థం లేదు. నిష్కృతి లేదు. రాజు కనులలో మెరపు తీగ తళుక్కున మెరిసింది. మరులిప్తలో ఎక్కడో ఫెళఫెళమంది. రాజు ఒక నిర్ణయానికొచ్చాడు.

ఇంటిలోనికి వెళ్ళి కావడి పెట్టెలోని

పాత శాలువా, నలువది సంవత్సరాలుగా తన్నంటి పెట్టుకున్న భజన చెక్కలు తీసుకొన్నాడు. ఏకాయెకిన ఒంటెద్దు బండి గంగులు దగ్గరికి వెళ్ళి, ''వైకుంఠపురానికి బండి కావాల'' అని అడిగాడు.

గంగులు క్షణకాలం నిరుత్తరుడయ్యాడు. ఆ వయసులో కృష్ణంరాజు ప్రయాణం. అందులో ఒక ప్రక్క ముంచుకు వస్తున్న వర్షం.

''బాబూ! పైన మొగిలి లేచింది. మిన్నున కైవారం వేసింది. జల్లాగదు'' అంటూ నసిగాడు గంగులు.

'నా స్వామి కల్యాణమూ ఆగదు' తనలో తాననుకొన్నాడు రాజు. పైకి, ''కాదు, గంగులూ! వెళ్ళాలి. కావలిస్తే రేటు ఎక్కువ తీసికో'' అన్నాడు.

గంగులులోని ఆశ వెర్రులెత్తి అనుమానం, భయం సర్దుమణిగి పోయాయి.

సాయంత్రం నాలుగు గంటలకు, ఈదర గాలి, చిరు చినుకుల జల్లుతో పాటు కృష్ణంరాజు నెక్కించుకొని గంగులు ఒంటెద్దు బండి ఎండ్రాయి గ్రామం నుంచి బయలుదేరింది వైకుంఠపురం కేసి.

***

ఎండ్రాయి గ్రామం, గుంటూరు నుండి అమరావతికి వెళ్ళే మార్గంలో ఉంది. ఆ గ్రామంలో కృష్ణంరాజు వంశం ఒకటిన్నర శతాబ్దులుగా ఉంటున్నది. అతని తాత ముత్తాతలందరు ఆస్తికులు. పాండిత్యం కలవారు. అనాదిగా వారు వృత్తిగా భజన పాఠాలు చెప్పుకొని జీవిస్తున్నారు. ఆ భజనలోనే వారి ఇహపర పరమార్థాలు నిక్షిప్తమయ్యాయి. ఎండ్రాయి గ్రామానికి, వైకుంఠపురానికి ఐదు మైళ్లుంటుంది. వైకుంఠపురంలో శ్రీ వెంకటేశ్వరస్వామి కోవెల ఉంది. అనాదిగా కృష్ణంరాజు కుటుంబానికి, వైకుంఠపురంలో ఉన్న ఆ శ్రీనివాసునికి అనుబంధ బాంధవ్యాలేర్పడ్డాయి. ఆ గ్రామప్రజలకు రాజు కుటుంబం దైవసమానం. రాజు కుటుంబానికి ఆ గ్రామ ప్రజలంతా భక్త కోటే. వారినందరిని నిరంతర సేవానిరతిలో ముంచి, ఆ జగన్నాథుని పాద సన్నిధికి చేరువ చేసే వ్యవస్థ తమది. ఆ ప్రయత్నంలో వారి జీవిత పారమార్థిక చింతన ఉంది.

సరిగ్గా 55 సంవత్సరాల క్రితం కృష్ణంరాజు 15 సంవత్సరాల నూనూగు మీసాల వయస్సున ప్రవేశించినాడు. తాత సుబ్బరాజుగారి చేత పండరీ భజనకై జీవితాన్ని కైంకర్యం చేస్తున్నట్టు ఆన తీసుకొని, నడుముకు కాసె బిగించి, చేత చెక్కబట్టాడు. అది ఓ పవిత్ర విద్యా సంస్కారాభిలాష; కూచిపూడివారు అయిదవ ఏట గజ్జె కట్టడం లాంటిది.

చేత చెక్క పట్టిన నాటినుంచి రాజు పరవశమందాడు. లోని చిత్త సంస్కారం, అనాదిగా వస్తున్న వంశ సంస్కారం కలగాపులగంగా కలిసి రాజు తన జీవిత పరమావధి కేసి సాగిపోయే ప్రయత్నంలో ఉత్తీర్ణుడు కావడానికి ఎంతో ఉపకరించాయి. రాజు మిసమిసలాడే ఇరవై సంవత్సరాల వయసు నాటికి భజనలో ఉత్తీర్ణుడయ్యాడు. భద్రాచలం రామదాసు కీర్తనలు పాడితే, గోపన్నే రాజులా జన్మమందాడనేవారు.

***

ప్రకృతి ఫెళ ఫెళమంది.



ఆలోచనల నుంచి తేరుకొని ముందుకు చూచాడు. కనుచూపు మేరలో వైకుంఠపురం కన్పించింది.

కృష్ణంరాజు 'అదిగో వైకుంఠపురం' అనుకొన్నాడు, కొండ ప్రక్కగా కన్పడ్డ కరణం గారి భవంతి చూచి. ప్రాణం లేచి వచ్చినట్లయింది. వెంటనే 'శ్రీరామచంద్రా!' అనుకొంటూ కనులు మూసుకున్నాడు ఆనందానుభూతితో. రామదాసు గానం చేసిన 'అదిగో భద్రాద్రి – గౌతమి ఇదిగో చూడండీ!' అన్న భజన పాట జ్ఞప్తికి వచ్చింది. వైకుంఠపురంలో వేంచేసి ఉన్న వెంకటేశ్వరస్వామి రామస్వామిగా, వైకుంఠపురమే భద్రాద్రిగా, దాని ప్రక్కనే పారుతున్న కృష్ణమ్మ గౌతమిగా పొడకట్టాయి. మనసంతా సంతోషంతో కదను త్రొక్కింది. ''ముదమున సీత, ముదిత లక్ష్మణులు చేరి గొలువగా రఘుపతి యుండెడి, అదిగో భద్రాద్రి, గౌతమి ఇదిగో చూడండి'' అంటూ కూనిరాగం ఆలపించాడు. మరో అరక్రోసుపోతే చాలు, వైకుంఠపురం వచ్చేస్తుంది. వచ్చేసినట్లే భావిస్తూ రాజు కండ్లు మూసుకొన్నాడు.

వైకుంఠపురానికి, తనకు, ఆ వెంకటేశ్వర స్వామికి ఏమిటో ఈ సంబంధం! తనకు ఆ ఊరికి తొట్టతొలి సారిగా సంబంధం ఏర్పడిన నాటి సంఘటన జ్ఞాపకానికి వచ్చింది రాజుకు. తనప్పటికి ఇరవైఏండ్ల వాడు. తన తాత సుబ్బరాజుగారు తన వెంట ఇలాగే స్వామివారి కళ్యాణం ముందు రోజు తీసుకొని వెళ్లాడు తనను. అప్పటికి తాతగారికి తనకు ఇప్పటి లాగే డెబ్బై సంవత్సరాలు. మొట్టమొదట తన చేత భజన బృందం నడిపించాడు తాతగారానాడు. ఆ రోజు తాను భజన చెబుతూంటే ఊళ్లో వాళ్ళంతా ముక్తకంఠంతో అన్నారు, తాతను మించిన వాడని. తాతగారానాడు తననా ఊరికి, ఆ ఊరిని తనకు అప్పగించి, ''నేను పెద్దవాణ్ణయ్యాను. ఇక అబ్బాయిని మీ కప్పగిస్తున్నాను'' అన్నారు.

ఆ గ్రామ ప్రజ ఔదలదాల్చింది.

''నాయనా, ఏనాటిదో ఈ బాంధవ్యం మనకు! ఈ స్వామిని కొలిచి, ఈ ప్రజలకు ముక్తి నిచ్చి నీవు ధన్యతగాంచు'' అన్నారు తనతో. ఆ మాటలు ఈనాటికీ ధ్వనిస్తున్నాయి తన ముందు. అంతా ఆ రోజు తనను చిన్నరాజు గారని ఎంతో గౌరవించారు. పెద్ద రత్తయ్య ఇంటికి పిలుచుకొని పోయి తాత గారికి, తనకు పంచల చాపు పెట్టి పంపించాడు.

''ఏరొచ్చింది రాజుగారూ!'' అంటూ గంగులు వేసిన కేకకు రాజు గతం నుంచి మేల్కొన్నాడు. ఎక్కడ వర్షం పడ్డదో వైకుంఠపురాన్ని అంటి పెట్టు కొని ఉన్న ఏరు పరవళ్ళు త్రొక్కుతున్నది.

''సంగడన్నా లేదు, రాజుగారూ!'' అన్నాడు గంగులు. రాజు ఆకాశం కేసి చూస్తూ ఉండిపోయాడు. దిగంతాన్నంతా వ్యాపించే కాంక్షతో వరుణుడు, కారు మేఘాలతో వస్తున్నాడు. కుండపోత తప్పదు.

''బాబూ! తిరిగిపోదాం'' నసిగాడు గంగులు.

రాజుకు దగ్గుతెర వచ్చింది. ఆ తెర తగ్గేపాటికి ప్రాణాలు ఎగిరి పోయి నట్లే అనిపించింది.

''వైకుంఠ పురానికి వెళ్ళాల్సిందే'' అన్నాడు రాజు. ''నీవు తిరిగి వెళ్ళు గంగులూ'' అంటూ కిరాయి ఇచ్చివేశాడు.

గంగులు తిరిగి వెళ్ళిపోయాడు. ప్రక్కనున్న మర్రికింద కూర్చున్నాడు రాజు, ఒంటరిగా. ఆ చీకట్లు క్రమ్ముతున్న సంధ్యలో రాజుకు ముప్ఫయి ఏండ్లనాటి సంఘటన జ్ఞప్తికి వచ్చింది. ఆనాడూ ఇలాగే ఏరు ఉరికింది. పైన జోరున వర్షం కూడా పడుతున్నది. అయినా తాను పట్టుదలగా కల్యాణం చేయించాలి, గజ్జెకట్టి భజన చేయాలి – అనే పట్టుదలతో అదే మర్రి క్రింద నిలబడ్డాడు. అంతలో ఆవలి గట్టునుంచి భుజంగరెడ్డి గొంతు వినపడ్డది, ''భజనపంతులుగారూ!'' అంటూ. తాను పలికాడు. భుజంగం ఏరుకడ్డం పడి వచ్చి దాటించాడు. భగవంతుడే స్వయంగా భుజంగం రూపంలో వచ్చి దాటించాడేమో అనిపించింది. ఆనాటి భుజంగం ఈనాడు లేడు. రాజు కనుల వెంట రెండు నీటి బొట్లు రాలాయి. 'మరి ఈ రోజే రూపంతో వచ్చి తీసుకొని వెళ్ళుతాడో ఆ స్వామి!' అనిపించింది. చేతిలోని భజన చెక్కలు అప్రయత్నంగా కదిలాయి. గొంతుక ''నను బ్రోవమని చెప్పు నారీ శిరోమణీ! జనకుని కూతుర జననీ జానకమ్మ, నను బ్రోవ మని చెప్పవే' అంటూ పాడసాగింది. చేతిలోని చెక్కలు తాళం మార్చాయి. ''ప్రక్కన చేరుక.. చెక్కిలి – నొక్కుచు'' అంటూ ఆ చరణం వివిధ గతుల్లో, వివిధ పద్ధతులలో, వివిధ తాళాలతో తాండవం చేస్తూంది. రాజు పరవశమై పోయాడు. వెనక ఒకసారి స్వామి కల్యాణానికి బందరు నుంచి వచ్చిన సాని మేళపు నాయకురాలు, రాజు నోట ఆ పాట విని, మరునాడు ఆయనను పాడమని తాను అభినయం చేసింది. 'అహా! అభినయం అమోఘం!' అని అబ్బురపడిపోయారు రాజుగారు. 'ఆహా! ఆ లయ విన్యాసం అత్యద్భుతం' అని మెచ్చుకొంది నాయకురాలు. ఆ యేడే రాజుకు బంగారుకట్లు, పూలూ వేయించిన భజన చెక్కలను ఇచ్చి సన్మానం చేశారు ఆ ఊరిలో.

ఆ చెక్కలను చూచి తన్మయత చెందాడు రాజు క్షణకాలం. గతంలోకి దూసుకుపోయాడు.

భామాకలాపాన్ని ప్రదర్శించింది ఒకనాడు నాయకురాలు. భామను చెలి కత్తె ఉడికిస్తున్నది, ''మల్లెపందిరదిగో సుందరి! మాధవుడల్లదిగో'' అంటూ. ఆ పాట మనోజ్ఞంగా ఉంది. మర్నాటి కల్లా తను భజన కత్తెకు అతుక్కునేలా సాధించాడా పాటను. తాను ఆ పాట పాడుతూ, భజన వరస వేస్తూ చక్రభ్రమణం చేయిస్తూ ఉంటే; వృద్ధుల్లా కన్పించే ఆ రసమూర్తులలో ఎంత ఆర్ద్రత విలసిల్లుతున్నదో అంతా తాముగా భ్రమించి భ్రమణాలు చేయిస్తున్నట్లు, చేస్తున్నట్లు అనిపించింది. నాయకురాలు ''రాజుగారి చెక్కలకు పలుకని పదమూ, పాటా ఏదీ ఉండదు. పద్యాలు కూడా పలుకతయ్యేమో!'' అంటూ, తన మెప్పును ప్రకటించింది. ఆ రాత్రికి రాత్రి రాజు గజేంద్ర మోక్షాన్ని భజన వరుసకు అనుగుణంగా పాటలను ఏరి కూర్చాడు. అందులో గజేంద్రుడు విష్ణుమూర్తిని ప్రార్థిస్తున్న ఘట్టంలోని పోతనామాత్యుల భాగవత పద్యాలను పాట వరసలో అడుగులు వేయించాడు. ''లావొక్కింతయులేదు, ధైర్యము విలోలంబయ్యె! ప్రాణముల్ ఠావుల్ దప్పెను. మూర్ఛ వచ్చె –'' అంటూ భజన వరసలో చిత్ర చిత్ర భ్రమణాలతో, అడుగుల్లో ఆ వరుస నిజంగానే గజేంద్రుడు దీనుడై లావు దప్పి, ప్రాణము మిన్ను పట్టుతుండగా, ఆయాసపడుతూ, అటూ ఇటూ ఊగిపోతూ, త్రాణ లేక ఆక్రోశిస్తున్నట్లే ఆ బృందమతా ఏకంగా కదులుతున్నట్లనిపించింది. నాయకురాలు అర్ధనూట పదహార్లు తాంబూలంలో పెట్టి రాజుకు ఇచ్చి దండం పెట్టింది.

ఆనాటి కళాభిమానం అలాంటిది!

''బాబూ! దండం బెడతా!'' అంటూ వినబడ్డ చుండి సీమడి కేకకు మేలుకొన్నాడు రాజు.


చుండి సీమప్ప! వైకుంఠపురాన్ని ఏభై సంవత్సరాలుగా అంటి పెట్టుకున్న కావలివాడు.

''ఏం బాబూ! ఏరు దాటనివ్వలేదా'' అంటూ దగ్గరగా వచ్చాడు సీమప్ప.

''అవున్రా! స్వామివారి కళ్యాణానికి రావాలని వచ్చాను'' అన్నాడు రాజు.

''నేను దాటవేస్తాను'' అంటూ తలకు గుడ్డ చుట్టుకొని వచ్చాడు సీమడు. రాజు మనసు కదను త్రొక్కింది. ''నను బ్రోవ నడిచి వచ్చితివా! నా పాలి దైవమా! నా రామచంద్రా!'' అంటూ చరణాన్నందుకొంది మనస్సు. సీమడు రాజు వెంట నడుస్తూ, ''ఏందో బాబూ! కాలమంతా పిదప కాలమై

## ప్రజల అభిరుచులు పలచబడుతున్నయ్!



నా చిన్ననాట 'ఎండ్రాయి' గ్రామం నుండి, రాజుగారొకరు వచ్చి, మేమున్న గ్రామం 'లింగంగుంట పాలెం'లో పండరి భజన నేర్పేవారు. ప్రతి సంవత్సరం మూడు నెలలపాటు, ఈ భజన పాఠశాల ఉండేది. దబ్బపండులాంటి శరీరచ్ఛాయ, ఆజానుబాహు రూపం, ఎప్పుడూ తెల్లని వస్త్రాలతో, కాలికి గజ్జెలుంచి, చేతిలో భజన చెక్కలూనిన రాజుగారు పరమాచార్యునిలా, అపర నృత్యమూర్తిలా గోచరించేవారు. ఆయన గానాలాపించిన భక్తి కీర్తనలు, నారాయణ తీర్థుల తరంగాలు, ఆ భజన కత్తు, చెరగని ముద్ర వేశాయి నా మదిలో. చదువుకోసం నేనా గ్రామం వదిలేశాను. పదిహేను సంవత్సరాల అనంతరం నేను ఉద్యోగినయ్యాక ఓ ఎండాకాలం మధ్యాహ్నం గుంటూరులో రోడ్డుపై కనిపించారు రాజుగారు. మాసిన బట్టలు, కాలికి చెప్పులు లేవు. మోములో వృద్ధాప్యపు ఆనవాళ్ళు. అదోలా దైన్యంగా ఉన్నారు. ఎలా ఉండే రాజుగారెలా అయి పోయారు?! నన్ను చూడగానే కౌగిలించుకున్నారు ఆర్ద్రంగా.

''ఎందుకిలా అయిపోయారు?'' అన్నాను.

''భజన నేర్చుకునే వారే లేరు. ప్రజల అభిరుచులు పలచబడుతున్నయ్. వారిని ప్రభలూ, రికార్డు డాన్సులు ముంచెత్తుతున్నాయ్. ఈ కళా రూపం మాతోనే పోతుందనే బాధ బాబూ! లింగంగుంట పాలెం నన్నూ, నా భజనను మర్చిపోయింది. ఆ గ్రామాన పాతతరం అంతా పోయింది'' అన్నారు.

ఆ మధ్యాహ్నం నాతో పాటు మా అన్నగారింటికి వచ్చి, భోంచేసి పోయారు రాజుగారు. ఆయన బతుకు ఇలా అయిపోవడం నన్నెంతో బాధించింది. దానినే కథగా మలచాను.

**–గంధం యాజ్ఞవల్క్య శర్మ**

**10-9-21, అరండల్‌పేట,**

**నరసరావుపేట-522601**

**సెల్ : 9885320765**

కవిత

# శిశిర చిత్రాలు



ఆ చేతిన మగ్గం ఆడకపోతే
ఈ ప్రపంచమే నగ్నమై పోతుందేమో!
లుప్తం కాని కళాత్మక నిపుణత క్షణక్షణం జనన మవుతూంటే
అనుక్షణికాన శ్రమైక జీవనం మరణమౌతోంది!!
ఇప్పుడా బ్రతుకు దారం చిక్కుపడ్డ వైనం..
విప్పుదామన్నా పీటముడి చిక్కులూ చికాకులు
పాపం రాట్నం తిరుగుతూ తిప్పలు పడుతోంది
దారీ తెన్నూలేని ఆ కనుకొలనులలో ఎన్ని శిశిర చిత్రాలో..!
కాలచక్రమై తిరిగే కదురులిరిగి
కరెంటు మోటారుతో కరచాలనం చేస్తోంది,
ఒకానొక అసంబద్ధత చేతివృత్తి శిథిలాల్లో
పోగుల నగిషీలు చెక్కుతూ..!!
సంక్షోభం జగమై.. సంక్షేమం కలయై
దారుణ సమస్యల ఉరికొయ్యకు
నేతన్నలోని నేత వ్రేలాడుతూన్న వేళ
ఇప్పుడు ఆకలి ఆర్తనాదం
పట్టు జరీల అంచుల్లో కలనేసినట్లుంది!
ఆవేదనల నిశీధి ఘోష
ఓ అమానుష అకృత్యానికి సాక్షీభూతమవుతోంది!!
ఎంత నిస్సిగ్గు..
మగ్గం గుంట మనో వ్యధతో కునారిల్లుతూంటే
కండెకన్నీరు మున్నీరవుతోంది!
పదహారు మడతల పట్టుచీర
అగ్గిపెట్టెలో ఎగుమతి అయిన నైపుణ్యం
అనాదిగా మానాలను కప్పి
నాగరికతకు నాందిగా కూడదీయలేక
ముతల్ వెతల మధ్య బడుగు ప్రపంచమవుతోంది!!
అవమానాలతో క్రుంగుతూ
శిరస్సులేని శిల్పమై మగ్గపు గుంటల్లో మగ్గుతూ..
ఆకలి పేగుల్ని ధూకలి అచ్చుల్లో అతికి
శ్రమ సౌందర్య కళారూపాల్లోకి తర్జుమా కాబడుతోంది!
విపణి వీధులనుండి విధి వేసిన వైనాన
మగ్గం విల్లుగా మారి
నాడి శరమై సంధించిన చిత్రాన,
పోరాట పటిమ సజీవన నేపథ్యం కానిచోట
నిరాదరణ పోటులో రాతలు మారిన నేతన్న
జీవముడిగిన జరీపోగుల్లో
రంగుల నిప్పుకణమై
శిశిర చిత్రాలను సజీవన కాన్వాస్ నుండి
అంతర్ధానం చేస్తూనే ఉంటాడు!!

**-వడలి రాధాకృష్ణ**

పోయింది. ఎనక మన రోజుల్లో భజన వరసబడితే దేవుడాడ ప్రత్యక్షమయ్యేవాడు. ఇప్పుడా ఓపికలూ లేవు. ఎంత సేపటికీ, ఆ బాకాల్లో పిచ్చిపాటలు పాడిత్తూ చెవులు గింగురు మనిపిత్తుండారు. డానుసులంట. పిల్లల్ని ఎగిరిత్తన్నారు ఎదవ గంతులన్నీ. కోటయ్య స్వామి తిరణాలకు కొండ కెళ్లితే, ఈ యేడు బాబూ, పెవలన్నిటికీ, ఎనక కట్టే శివలీల గుడ్డలు లేవు. అన్నీ సినిమా కాకితాలే'' అంటూ చెప్పుకు పోతున్నాడు. రాజు కెదురుగా సుళ్లు తిరుగుతూ ఏరు గింగిర్లు పెడుతున్నది. రాజుగారి కళ్ల వెంట నీళ్లు అలాగే తిరిగి పోతున్నాయి. వెనక తాను కోటప్ప కొండకు వెడితే, తన భజన బృందానికి, మరో దానికి, లేదోపులో పోటీలు పడ్డాయి. జనమంతా ఏ భజన మిగులో తేల్చుకోవాలని కూచున్నారు. తాను నారాయణ తీర్థుల తరంగాలు పట్టించాడు. 'శరణం భవ కరుణా మయికురు దీనదయాళో!' అంటూ మొదలు పెట్టాడు. అవతలి జట్టు చచ్చు పడ్డది. వాళ్ళంతా వచ్చి చూడటం మొదలెట్టారు. తానూ ఇట్టే గ్రహించాడు, వాళ్ళకు తరంగాల్లో ప్రవేశం లేదని. ''యజ్ఞా యజ్ఞా సంరక్షణా యాదవ వంశాభరణా'' అన్న పాదాన్ని వివిధ గతుల్లో మెలికలు వేయించాడు. పై ప్రేక్షకులంతా మొగ్గలు వేశారు. అవతలి భజన పంతులు వచ్చి తన మెడలోని పూలదండను రాజు మెడలో వేసి, 'కృష్ణంరాజు గారికి జై' అన్నాడు. రాజు 'తప్పు నాయనా! కృష్ణ పరమాత్మకు జై' అని జేజేలు కొట్టించాడు. ఆనాటి కోటప్ప కొండ ప్రభలలో నక్షత్రాలను తాకేది నల్లపాటి ప్రభ. ఆ ప్రభల నిండా శివలీలలు ఎంత సుందరంగా ఉండేవో! ఆనాటి ప్రజలే వేరు. ఆ చిత్త ప్రవృత్తే వేరు. ఆ వెర్రి వేరు. ఆ అనుభూతే వేరు.

''బాబూ! పై పంచె కట్టుకోండి. దాటుదాం!'' అంటూ సీమప్ప, రాజును ఈ లోకంలోకి తీసుకు వచ్చాడు. అవతలి ఒడ్డున చేర్చి, దండం పెట్టి, ''సెలవు తీసికొంటా బాబూ!'' అన్నాడు సీమప్ప.

''కళ్యాణానికి రావా సీమప్పా?'' అన్నాడు రాజు.

''వడ్డమామదాక పోయిరానా బాబూ!'' అన్నాడు సీమప్ప. సీమప్ప అలా వెళ్లిపోగానే రాజు తలెత్తి చూచాడు. ఎదురుగా వైకుంఠపురం కన్పించింది. చీకటి క్రమ్మింది. అంతటి చీకటిలోను, ఊరిలో ఎలెక్ట్రిక్ దీపాలు వెలిగి పోతున్నాయి.

రాజు రెండు ఫర్లాంగుల దూరంలో ఉన్న ఊరికేసి బయలు దేరాడు ఒంటరిగా. ఆలోచనలు వెనుకకు లాగినవి.

రాజు ప్రభ వైకుంఠపురంలో నలభై సంవత్సరాలు సాగిపోయింది. సరిగ్గా పది సంవత్సరాల క్రితం, స్వామి కళ్యాణం నాడు, డొక్కలో పోటు వచ్చింది. అలాగే స్వామివారి కల్యాణం ముగిసే వరకు ఓపికతో భజన చేయించాడు. ఆ తరువాత వైకుంఠపురంలోని ఆయుర్వేద వైద్యులు ఆచార్యులుగారు రాజును పరీక్ష చేసి ''రాజుగారూ! వయసయింది. ఇక మీరు తట్టుకోలేరు. విశ్రాంతి అవసరం'' అన్నారు. అప్పటికి రాజు వయసు అరవై సంవత్సరాలు.

''అంతేనంటారా?'' అన్నాడు రాజు.

''అంతే!'' అన్నారు ఆచార్యులుగారు.

రాజు కళ్లవెంట నీరు కారిపోయింది. 'నా స్వామి కల్యాణం చేసుకోవటానికి నాకీ అవరోధ మేమిటి?' అని. కన్నీరు మున్నీరయింది. 'స్వామీ! నీ భజన చేసుకోవటానికి, నాకీ అలసట ఏమిటి.' అంటూ వాపోయాడు.

ఆ మరుసటి సంవత్సరం తన తమ్ముడు రామరాజును వైకుంఠపురానికి అప్పగించాడు, కృష్ణంరాజు. ఈ పది సంవత్సరాలుగా కృష్ణంరాజు అస్వస్థతతో, స్వామివారి కల్యాణానికి రాలేక పోతున్నాడు. తమ్ముడు రామరాజే భజన చెప్పి ఆ కల్యాణ మహోత్సవాలను జరిపిస్తున్నాడు. వైకుంఠపురం నుంచి తమ్ముడు రామరాజు స్వామి వారి కల్యాణం చేయించి వచ్చాక, అక్కడి విశేషాలు ఓపిగ్గా విని ఆనందించేవాడు. ఆ స్వామి వారికి అలంకరణ ఎలా జరిగిందీ, స్వామి కల్యాణం నాడు ఏ యే కీర్తనలు రామరాజు గానం చేసిందీ అడిగి తెలిసికొని ఆనందానుభూతిలో మునిగిపోయేవాడు.

ఈ పది సంవత్సరాలలోనూ ఎంత మార్పో! వృద్ధులు ఒక్కరొక్కరే పండుటాకుల్లా రాలిపోయారు వైకుంఠపురంలో. రెడ్డెమ్మ లాంటి సహృదయుడు, వివేకి, జ్ఞాని స్వామి సన్నిధి చేరిపోయాడు. ఆ వార్త విన్న రోజు

రాజు శోకమూర్తి అయ్యాడు. ఇలాగే బొల్లయ్య, అవధాని.. ఎలా ఎందరో భక్తులు రాలిపోయారు. ఆ తరం పోయింది.. మరో తరం తరలి వచ్చింది.

ఈ సంవత్సరం రామరాజు స్వామివారి కల్యాణానికి వెళ్లాడు వైకుంఠపురం. కాని కల్యాణం ముందు రోజే తిరిగి వచ్చాడు. అలా అర్ధాంతరంగా తిరిగి వచ్చిన తమ్ముణ్ణి చూచి కృష్ణంరాజు నిరుత్తరుడయ్యాడు. ''ఏమిటిది?'' అని ప్రశ్నించాడు.

''ఆ ఊరికి, మనకు ఋణం తీరిపోయింది'' అన్నాడు రామరాజు.

ఫెళ ఫెళమని పిడుగు పడినట్లు అయింది.

''ఊరు మారిపోయింది. వెర్రి తలలు వేస్తోంది. జ్ఞానలవ దుర్విదగ్ధులంతా పెత్తందారులైనారు. మన భజనను అవమానించారు. ఇంకెక్కడి స్వామి!'' అన్నాడు రామరాజు.

కృష్ణంరాజు కూలిపోయాడు. అతనిముందు నలభై సంవత్సరాలనాటి స్వామి సాక్షాత్కరించారు. 'అంతటి వేలుపు కెంతటి దీనస్థితి!'

రామరాజు వైకుంఠపురం వెళ్లననటంతో, కృష్ణంరాజు బయలుదేరాడు స్వామి కల్యాణానికి.

***

వీధి దీపాల వెలుతురున నడిచి వెళ్లాడు రాజు. ఆయనను గుర్తు పట్టి పలుకరించిన వాళ్లే లేకపోయారు. పెద రత్తయ్యగారింటికి వెళ్లారు. పెద రత్తయ్య మనుమడిప్పుడు పెత్తందారు. ఆ పెత్తందారిల్లు తాళం వేసి ఉంది. కరణం గారింటి కేసి వెళ్లాడు. కరణంగారు బెజవాడలో మకాం పెట్టారట. ఆ ఇంటిలోనూ ఎవరూ కన్పించలేదు. లంకంత కొంప బావురుమంటున్నది. ఒకప్పుడు బ్రహ్మరథం పట్టించుకొన్న ఆ ఊళ్లో రాజును గుర్తించిన వారే లేకపోయారు. వీళ్లంతా గుర్తు పట్టలేకపోయినా, 'ఆ వేంకటేశ్వరస్వామి గుర్తు పడతాడు' అని, గుడి వీధికేసి బయలు దేరాడు.

ఆ వీధి అంతా జనసమ్మర్దంగా ఉంది. ఎలెక్ట్రిక్ దీపాలు వెలిగిపోతున్నాయి. కాని ఏమిటో ఆ గత శోభ కన్పించలేదు రాజుకు. అతి కష్టం మీద దేవాలయం చేరుకోగలిగాడు. కాని, లోపలకు పోవటానికి వీలు పడింది కాదు. కళ్ల వెంట నీరు తిరిగింది, చివరికి ఈ దేవాలయం కూడా తనను గుర్తించనందుకు. అంతలోనే, ఎవరో ''డాన్సు, డాన్సు'' అన్నారు. అక్కడి జనమంతా, విరగద్రొక్కుకున్నట్లు బయటకు కదిలారు. ఆ సమ్మర్దంలో రాజు తూలి పడిపోయాడు. ఒకరిద్దరు ఆయన మీదుగానే నడిచి వెళ్లారు. ఆ జనసందోహం తరలి వెళ్లి, దేవాలయానికి కొంచెం దూరంలో బండి మీద సాగుతున్న 'డాన్సు' చూస్తున్నారు. రికార్డు సంగీతానికి అనుగుణంగా చిందేస్తున్నారు, ఆ బండిమీద ఆ 'డాన్సు' వాళ్లు. నేల మీదనుండి, దగ్గుతెర నుండి తేరుకొని, గోడ నాధారం చేసుకొని గర్భాలయంలోకి వెళ్లాడు రాజు. స్వామి మోము వెలవెల పోతున్నది, ఆ విద్యుద్దీపాల ముందు. ఆ ఆముదపు దీపాల కాంతి, ఆ కాగడాల దీప్తి లేవీనాడు.

బయట ''ఓ వయసుకాడ ఇటు రారా!'' అంటూ హోరు విన్పిస్తున్నది.

రాజు కూలబడ్డాడు స్వామి ముందు.

రాజు మనస్సు శిథిలమయింది. చిన్నగా ''ఏ తీరున నను దయచూచెదవో ఇనవంశోత్తమ రామా! నా తరమా భవసాగరమీదను..'' అంటూ చెక్కలను ఆడిస్తూ, చిన్నగా పాడుకోసాగాడు. ప్రక్కగా, ఒక్కగా నొక్క స్త్రీమూర్తి వృద్ధురాలు, కండ్లు మూసికొని కూర్చున్నదల్లా కండ్లు తెరిచి చూడసాగింది రాజును. ఆమె పాటను ఆనందానుభూతితో నిమీలిత నేత్ర అయి వినసాగింది. చివరిసారిగా రాజు ''లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె ప్రాణముల్ ఠావుల్ దప్పెను, మూర్ఛ వచ్చె... నీవే తప్ప నిత:పరంబెరుగ మన్నింపం దగున్ దీనునిన్ రావే ఈశ్వర కావవే వరద సంరక్షించు భద్రాత్మకా!'' అంటూ వాలిపోయాడు. పాటగా సాగిన ఆ పద్యాన్ని, ఆ స్తోత్ర గీతాన్ని పూర్తిగా వింటూనే కనులు తెరిచిన ఆ స్త్రీమూర్తి ''రాజుగారూ! రాజుగారూ!'' అంటూ వచ్చి వాలిపోతున్న ఆ రాజుగారిని పొదివి పట్టుకుంది. ఆఖరిసారిగా కండ్లు తెరిచిన రాజు, ''అమ్మా! నీవింకా ఉన్నావా? సెలవయింది, స్వామి సెలవయింది'' అంటూ కనులు మూశాడు.

నాయకురాలు ఏనాడో చూచింది వైకుంఠపురం. ఈనాడు ఎలా ఉందో చూద్దామని పని గట్టుకొని వచ్చింది. రాజు దహన సంస్కారానికి కావలసిన డబ్బిచ్చుకుంది. అది కర్మ భవబంధం. అగ్ని సంస్కారం చేయబోయే ముందు చితి చుట్టూ కృష్ణవేణమ్మ పాయ అయిన ఏటిలో స్నానం చేసింది. తెల్లావారే సరికి అనుకోనంత కృష్ణకు వరద వచ్చి, ఏటి పాయనంటి ఉన్న రాజుగారి చితాభస్మాన్ని చిటికెడు మిగల్చకుండ తనలో లీనం చేసికొంది.

చుండి సీమడు కాటికెళ్లి ''నిన్ననే చివరి దర్శనం స్వామీ!'' అంటూ ఆక్రోశించాడు.

కృష్ణమ్మ భీకరంగా, దీనంగా ఏదో అవ్యక్త భావాన్నాలాపించింది ఆ నీటి ఉరవడిలో.

*

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 27-2-1963*




## కత్రిన నోట ఇంగ్లీష్ రైమ్స్...

కత్రినా ఇప్పుడు ఇంగ్లీష్ రైమ్స్ నేర్చుకోవడం ఏమిటని ఆశ్చర్యపోకండి. కత్రిన ముద్దు ముద్దుగా ఇంగ్లీష్ రైమ్స్ చెప్పింది ఓ ఆల్బమ్ కోసం. రెహమాన్ చేస్తున్న ఓ ఆల్బమ్ కోసం కత్రిన నర్సరీ రైమ్స్ పాడింది. రెహమాన్ దగ్గర పాడాలని సింగర్‌లు కలలు కంటూ ఉంటే, ఆ అవకాశం కత్రినాను వెదుక్కుంటూ వచ్చింది. ఈ దెబ్బతో కత్రిన పెద్ద సింగర్ అయిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదని పలువురి ఉవాచ. అయితే తాను సింగర్‌గా ఫీలయి నర్సరీ రైమ్స్ పాడలేదని, తన ఇంగ్లీష్ యాక్సెంట్ రెహమాన్ సార్‌కి నచ్చడంతో ఆ అవకాశం ఇచ్చారని కత్రిన అంటోంది. ఇప్పటి వరకూ బాలీవుడ్, టాలీవుడ్‌ను ఓ ఊపు ఊపుతున్న కత్రిన భవిష్యత్తులో సంగీతంలో కూడా తన సత్తాను చాటుకునే అవకాశాలు ఉన్నాయన్నది మరికొందరి వాదన.